


బ్రహ్మంసాగర్ నుంచి కాల్వలకు నీటిని వదులుతున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

ప్రతి ఎకరాకు బ్రహ్మంసాగర్ నీరు

- పుట్టా సుధాకర్ యాదవ్
- కుడిఎడమ కాల్వలకు నీటి విడుదల
- బ్రహ్మంగారి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 17: బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు నీటిని అందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన కుమారుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌తో కలసి బ్రహ్మంగారిమఠానికి విచ్చేశారు. వీరికి బ్రహ్మంగారిమఠం ఐదురోడ్ల కూడలి వద్ద చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కానాల మల్లికార్జునరెడ్డి గజమాలతో సన్మానించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకరబాలాజీ ఆహ్వానం కలిపి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఎడమ కాల్వకు 400 క్యూసెక్కులు, కుడికాల్వకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలోని ప్రతి రైతుకు నీటిని అందించడమే తమ లక్ష్యమన్నారు. అలాగే బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద ఉన్న లక్షా 50 వేల ఎకరాలకు నీటిని అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో చెరువులను నింపుతామన్నారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న చిన్న చిన్న పిల్లకాల్వలకు మరమ్మత్తు పనులు చేయిస్తామన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ, ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. మైదుకూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా, వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రితీశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, ఎల్లటూరు ఈశ్వర్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.



బ్రహ్మంసాగర్ కాలువలో వెళుతున్న నీరు

జిల్లాలో జనాలను జ్వరాలు వణికిస్తున్నాయి. ఏ ఊరిలో చూసినా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. టైఫాయిడ్, వైరల్ ఫీవర్, డెంగ్యూతో జనం మంచం పట్టారు. నయం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు తిష్టవేసి జనాలను గుల్ల చేస్తున్నాయి. మంగళవారం ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించగా ప్రతి పల్లెలో సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు కనిపించారు. జగన్ హయాంలో కేంద్రం పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించడంతో పారిశుధ్యం పడకేసింది. కొత్త ప్రభుత్వ హయాంలో నిధులు వస్తున్నా పాత బిల్లుల బకాయిలకు తీసుకుంటున్నారు. దీంతో పారిశుధ్యం మెరుగుపడక పోవడంతో పల్లెలు పడకేశాయి. సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో జనం అవస్థలు పడుతున్నారు. డేంజర్ డెంగ్యు కూడా అధికార లెక్కల ప్రకారమే 120 కేసులు నమోదయ్యాయంటే అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. జిల్లా వైద్యశాఖ అప్రమత్తం కాకుంటే జనం మరింతమంది జ్వరాల బారిన పడి ఆరోగ్యంతో పాటు ఆర్థికంగానూ చితికిపోయే ప్రమాదం ఉంది.



ట్రీట్‌మెంటుకు తీసుకుపోతున్న బాధితుల కుటుంబీకులు

జ్వరాలతో విలవిల

- టైఫాయిడ్, వైరల్ ఫీవర్ల విజృంభణ
- పెరుగుతున్న డెంగ్యూ కేసులు
- మలేరియా కేసులు నమోదు
- ఆసుపత్రులకు జనం క్యూ

ఆంధ్రజ్యోతి విజిట్

(కడప-ఆంధ్రజ్యోతి): పల్లె పట్టణం అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించాయి. వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, డెంగ్యు, అక్కడక్కడా మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వైరల్ జ్వరం వచ్చినా టైఫాయిడ్ వచ్చినా వారం రోజుల పాటు కృంగదీస్తుంది. దీంతో వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. ఇక కడప, ప్రొద్దుటూరు పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. స్థోమత ఉన్న కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. ఎక్కువమంది ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

రూ.3వేల నుంచి రూ.5వేలు ఖర్చు

వైద్యం చాలా ఖరీదైనది. డాక్టరు నాడి పట్టాలంటే కూడా ఫీజు చెల్లించాలి. కడపలో ఓపీ ఫీజు ఆసుపత్రిని బట్టి రూ.300 నుంచి రూ.500వరకు ఉంది. ఇక పరీక్షలు చేస్తే తప్ప డాక్టర్ చీటీ రాయడు. దీంతో రక్తపరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్, మందులు కలుపుకుని సరాసరి ఒక్కొక్కరు రూ.3వేల నుంచి రూ.5వేల దాకా ఖర్చు చేస్తున్నారు. జ్వర పీడితులతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. వచ్చిన వారిలో 80 శాతం మందికి రక్త పరీక్షలు చేస్తున్నారు.

రోగులతో కిటకిట

సీజనల్ వ్యాధుల ధాటికి ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. కడప రిమ్స్ ఆసుపత్రిలో మధ్యాహ్నం 11గంటల ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా రోగులు వైద్యం కోసం వేచి ఉన్నారు. ఉదయం నుంచి ఓపీ ఫుల్‌గా ఉంటుంది. రోజూ సుమారు 1500కు పైగా ఓపీ ఉంటుంది. అయితే ప్రస్తుతం ఓపీ సంఖ్య పెరిగింది. రోజూ వంద మందికి పైగా సీజనల్ వ్యాధులతో బాధపడుతూ వచ్చే వారే ఉన్నారు. కొందరు ట్యాబ్‌లెట్లు ఇంజక్షన్లు వేసుకుని ఇంటికి వస్తుండగా కొందరు అక్కడే ఉండి ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు. ఓపీ కేంద్రం పై అంతస్తులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

- పులివెందుల ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఇక్కడకు వచ్చిన ఓపీలో మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్ డెంగ్యు కేసులు ఎక్కువగా ఉన్నాయి. మంగళవారం ఒక్కరోజే సుమారు 70 మంది దాకా బాధపడుతూ వైద్యం కోసం వచ్చారు.
- వేంపల్లె మండలంలోని రాజీవ్‌కాలనీ, ముత్తుకూరు, తప్పెట్లలో జ్వరాల ధాటికి జనం అవస్థలు పడుతున్నారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
- ఒంటిమిట్ట ప్రభుత్వ ఆసుపత్రికి వైరల్ ఫీవర్ బారిన పడిన వారు బారులు తీరారు. చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.
- జమ్మలమడుగు డివిజన్‌లో టైఫాయిడ్ తీవ్రంగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.
- కాశినాయన మండలంలోని నరసన్నపల్లె గ్రామంలో చలి జ్వరం, దగ్గు జలుబుతో 20 మంది బాధపడుతున్నారు. వీరిలో కొందరికి రక్తకణాలు తగ్గుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.
- కమలాపురంలోని గొల్లపల్లె, జంభాపురంలో టైఫాయిడ్, డెంగ్యు బాధితులు ఉన్నారు. ఇక్కడ పది మంది దాకా టైఫాయిడ్ బారిన పడగా ఇద్దరికి డెంగ్యు సోకింది. కడపలో ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు.
- చింతకొమ్మదిన్నెలో టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు ఉన్నాయి. సుమారు 200 మంది దాకా వీటి బారిన పడ్డారు. స్థానికంగా కొందరు, కడపలో మరికొందరు ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు.
- అట్లూరు మండలం గార్లపల్లె గ్రామంలో 150 కుటుంబాలు ఉంటే 50 మంది టైఫాయిడ్, మలేరియా, వైరల్‌ఫీవర్ బారిన పడ్డారు.
- ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. ఇక్కడా పెద్ద సంఖ్యలో జ్వరానికి చికిత్స పొందుతున్నారు.
- పోరుమామిళ్ల మండలంలోని రామాయపల్లెలో 30 మందికి పైగా వైరల్‌ఫీవర్స్ దగ్గుతో బాధపడుతున్నారు. స్థానికంగా ట్రీట్‌మెంటు తీసుకున్నా తగ్గకపోవడంతో ప్రొద్దుటూరు, కడప ఆసుపత్రులకు వస్తున్నారు.
- బద్వేలు మండల పరిధిలోని లక్ష్మీపాలెంలో 300 కుటుంబాలు ఉంటే 150 కుటుంబాల్లో పిల్లలు, పెద్దలు అందరూ జ్వరాలబారిన పడ్డారు. వీరిలో చాలా మంది బద్వేలులో చికిత్స పొందుతున్నారు.
- గోపవరం మండలం రామిరెడ్డిపల్లెలో 60 కుటుంబాలు ఉండగా 55 కుటుంబాల వారు జ్వరాలతో బాధపడుతున్నారు. రాచాయిపేట హరిజనవాడలో 10 కుటుంబాలు జ్వరాలతో బాధపడుతున్నాయి. జ్వరపీడితులతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. గోపవరం మండలం శిరిగిరిపల్లెలో జ్వరాలతో జనం విలవిలలాడుతున్నారు. ఇక్కడ 300 కుటుంబాలు ఉంటే సుమారు 20 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. కలసపాడు మండలం మామిళ్లపల్లెలో జ్వరపీడితులు ఉన్నారు. పోరుమామిళ్ల మండలం రామాయపల్లెలో సుమారు 30 మంది దాకా విష జ్వరాల బారిన పడ్డారు.

120 డెంగ్యు కేసులు

జిల్లాలో ఇప్పటివరకు 120 డెంగ్యు కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి మనోరమ వెల్లడించారు. మలేరియా కేసులు 10 నమోదయ్యాయన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ సెక్రటరీలతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టాలని వెల్లడించారు. అయితే డెంగ్యు లెక్కలు మరింత పెరిగే అవకాశం ఉంది. చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు.



బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద క్యూలో ఓపీ కోసం వేచి ఉన్న రోగులు



బద్వేలు ఆసుపత్రిలో రోగులకు ట్రీట్‌మెంటు



జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరపీడితులు



ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



పులివెందుల ఏరియా ఆసునత్రిలో బారులు తీరిన రోగులు



జమ్మలమడుగు ఆసుపత్రిలో రక్తపరీక్షల కోసం వేచి ఉన్నరోగులు

వ్యక్తిగత శుభ్రతతో నులిపురుగుల నివారణ : జేసీ



నులిపురుగుల నివారణపై మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. మంగళవారం కడప మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 2 సంవత్సరాల్లోపు పిల్లలకు 200 మి.గ్రా, 3 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు 400 మి.గ్రా ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం తరువాత వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రధానంగా పిల్లలు గోర్లు కత్తిరించుకోడం, భోజనానికి ముందు సబ్బుతో చేతులు కడుక్కోవడం, కాళ్లకు చెప్పులు ధరించడం చేయాలని సూచించారు. బహిర్భూమికి మరుగుదొడ్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వైవో నందన్, డీఈవో అనురాధ, అడిషనల్ కమిషనర్ రాకేశ్, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, డాక్టర్ ఎస్.రమేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి శాండ్ పోర్టల్ ప్రారంభం

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ఇసుక పాలసీకి సంబంధించి గురువారం నుంచి ఏపీ ఆన్‌లైన్ శాండ్ పోర్టల్ అందరికీ అందుబాటులోకి రానుందని జేసీ అదితిసింగ్ అన్నారు. ఈ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలో ప్రారంభిస్తారన్నారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డురూంలో న్యూ శాండ్ పాలసీ, ఏపీ ఆన్‌లైన్ శాండ్ పోర్టల్ మీద శిక్షణా కార్యక్రమం జరిగింది. జేసీ మాట్లాడుతూ ఇసుక బుకింగ్ ప్రక్రియ, రవాణాదారుల జాబితా పొందుపరిచే ప్రక్రియ, బల్క్ వినియోగదారుల ఇసుక అవసరాన్ని ముందుగానే గుర్తించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్లు సంబంధిత గనుల శాఖ ద్వారా జేసీ లాగిన్‌కు పంపాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారుడు మొబైల్ యాప్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవచ్చన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ముమ్మరదాడులు

- వారం రోజుల్లో 407 మందిపై కేసులు నమోదు

కడప(క్రైం), సెప్టెంబరు 17: బహిరంగ ప్రదేశాల్లో బహిరంగ మద్యపానంపై ముమ్మర దాడులు చేసి వారం రోజుల్లో పోలీసులు 407 మందిపై కేసులు నమోదు చేశారు. వారంరోజుల్లో జిల్లా పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు విడుదల చేశారు. బహిరంగ మద్యపానం చేసిన ప్రదేశాలను గుర్తించి మునిసిపల్, పంచాయతీ అధికారుల సమన్వయంతో అక్కడ క్లీన్ చేయించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన 646 మందిపై కేసులు నమోదు చేసి మొత్తం రూ.87,210 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహించి 4.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు. గ్యాంబ్లింగ్‌పై 10 కేసుల్లో 74 మంది జూదర్లను అరెస్టు చేసి రూ.4,84,630 నగదు సీజ్ చేశారు. మట్కా నిర్వహిస్తున్న 17 మందిని అరెస్టు, రూ.51,520 నగదు సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాదారులను 23 మందిని అరెస్టు చేసి 65 టన్నుల ఇసుక, 17 వాహనాలు సీజ్ చేశారు. 34.56 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని 7 కేసుల్లో ఏడుగురిని అరెస్టు చేశారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా 6 కేసుల్లో 35 మందిని బైండోవర్ చేశారు. 23 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ

- జయంతి వేడుకల్లో కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 17: ప్రపంచ తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ అని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రపంచ తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మ భగవానుని జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబరు 17న జరుపుకుంటున్నా మన్నారు. శివుని త్రిశూలం, ఇంద్రుని వజ్రాయుధం, విష్ణువు సుదర్శన చక్రంతో సహా దేవతల అద్భుతమైన ఆయుధాలకు సృష్టికర్త అంటూ అనేక గ్రంథాల్లో విశ్వకర్మ ప్రాశ్యస్త్యాన్ని ప్రస్తావించారన్నారు. విశ్వబ్రాహ్మణ అని కూడా పిలిచే విశ్వకర్మ సంఘం దేశంలోని ఒక గొప్ప సామాజిక సమూహంగా ఉందని అందులో ఉప సమూహాలైన కమ్మరి, వడ్రంగి, కాంస్య, స్వర్ణకారుల కులవృత్తుల వారందరినీ విశ్వకర్మలుగా పిలుస్తారన్నారు. వారి కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం ద్వారా లక్ష రూపాయల రుణాన్ని ఇస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విశ్వకర్మ జయంతి కార్యక్రమం అనంతరం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, స్వచ్ఛతా హి సేవ, హౌసింగ్, నూతన ఇసుక పాలసీ తదితర అంశాలపై మండల, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి వాటి నుంచి సంపద తయారు చేసే విధానంపై సంబంధిత శాఖల అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడంలో ప్రత్యేకాధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామాలు, వార్డుల పరిధిలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, బీసీ సంక్షేమ శాఖాధికారి భరత్ కుమార్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, బ్రహ్మంగారి మఠం ప్రధానాచార్యులు గోవింద స్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు నారాయణమ్మ, నరసింహాచారి, అధికారులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.10లక్షల చెక్కును అందిస్తున్న బీటెక్ రవి తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 17: విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు అండగా మేమున్నామంటూ పులివెందుల నియోజకవర్గ టీడీపీ నేతలు ముందుకొచ్చారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రూ.10లక్షల చెక్కును మంగళవారం అందించారు. బీటెక్ రవి సొంత నిధులు రూ.6లక్షలు, దాతల నుంచి పులివెందుల నియోజకవర్గంలో సేకరించిన రూ.4లక్షలను సీఎంకు అందించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, శ్రీరామిరెడ్డి, చాగలేరు భాస్కర్‌రెడ్డి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి




సోమిరెడ్డి మృతదేహం, సోమిరెడ్డి (ఫైల్)

పులివెందుల టౌన్, సెప్టెంబరు 17: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి (58) విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. రైతు సోమిరెడ్డి గ్రామంలోని తన తోట వద్దకు రోజు మాదిరిగానే మంగళవారం వెళ్లాడు. విద్యుత్ స్టార్టర్ ఆన్‌చేయగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి చనిపోయాడన్నారు.ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడు సోమిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



పులివెందుల టౌన్, సెప్టెంబరు 17 : పులివెందుల పట్టణంలోని జెండామానువీధికి చెందిన సయ్యద్ ఖాసిం పీరా కుమారుడు సయ్యద్ ఖాదర్‌బాషా (43) మంగళవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాల మేరకు.. ఖాదర్‌బాషా గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిలోనే ఉండేవాడు. ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి ఖాదర్ బాషా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

ముద్దనూరు సెప్టెంబరు 17: మండల పరిధి ఓబులాపురం గ్రామ సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు చెన్నమ్మ(65)అనే వృద్ధురాలు పడి మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన చెనమ్మ చూపు సరిగా కన్పించక పోవడంతో బావిలో పడటంతో మృతి చెందింది. మంగళవారం మృతదేహం బావిలోని నీటిలో తేలి, దుర్వాస రావడంతో ప్రజలు చెన్నమ్మగా గుర్తించారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ.. పలువురికి గాయాలు

రామాపురం, సెప్టెంబరు 17: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం పోలీస్ చెక్‌పోస్టు వద్ద సోమవారం అర్ధరాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేలూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఏపీఎస్‌ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును కడప నుంచి రాయచోటి వైపు వస్తున్న సిమెంటు లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి సిబ్బందితో చేరుకొని గాయపడిన వారిని కడప, రాయచోటి ఆసుపత్రులకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో ఐదేళ్ల జైలు

సికెదిన్నె, సెప్టెంబరు 17: వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసులో సయ్యద్ దస్తగిరి అనే వ్యక్తికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ శిక్ష విధించినట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం బలిజపల్లికి చెందిన పగడాల నాగయ్యకు నాయనవారిపల్లెకు చెందిన సయ్యద్ దస్తగిరి మధ్య భూ తగాదా ఉండేది. ఈ నేపథ్యంలో నాగయ్య తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా దస్తగిరి తల్వార్‌తో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు 3.5.2016న పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపి.. మంగళవారం కోర్టు శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి లా పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: వైవీయూలో ఈ నెల 18 నుంచి 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించి 2, 4, 6 సెమిస్టర్లు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు 2, 4, 8, 10 సెమిస్టర్లు చదివే విద్యార్థులు నిర్దీత తేదీల్లో సూచించిన సమాయానికి పరీక్షలకు హాజరు కావాలన్నారు. పరీక్షలు అక్టోబరు 10వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు నిబంధనలు పాటించాలని సూచించారు. చదువుతున్న కళాశాలల నుంచి హాల్‌టికెట్లు గుర్తింపు కార్డులతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

ఇష్టానుసారం బార్లు తెరిస్తే చర్యలు తప్పవు : సీఐ

కడప క్రైం, సెప్టెంబరు 17: నిబంధలనలకు విరుద్ధంగా బార్లు తెరిస్తే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ రంగాస్వామి హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం బార్ల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు తెల్లవారుజామున 5గంటలనుంచి బార్లు తెరచి వ్యాపారాలు చేస్తున్నారని.. ఉదయం 10 గంటలపైనే తెరుచుకోవాలన్నారు. బార్లపై పోలీసు నిఘా ఉంటుందని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, బార్ల యాజమన్యం పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నందలూరు, సెప్టెంబరు 17 : మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈప్రమాదంలో ఇంటిలోని బైకు, టీవీ, కూలర్, ఫ్యాన్లు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు శివకుమార్ వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు మెగా తాళం చెవిని అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 17: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధి విధానాలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ ఎస్ఐసీ హాలు నుంచి కలెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా దేశంలోని గ్రామీణ, మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ ప్రాంతాలలో 2023-24కు సంబంధించి నిర్మాణాలు పూర్తి చేసుకున్న కోటి యాభై లక్షల ఇళ్లతో పాటు, ఆవాస్‌ప్లస్ 2024 యాప్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రధాని ప్రసంగం ముగిసిన తరువాత కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విడుదల చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధి విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండలన్నారు ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఒక ఆవాసం ఏర్పాటు చేయడం ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరైన వారందరూ త్వరగా ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. గృహనిర్మాణ శాఖ చిత్తశుద్ధితతో కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీలలో మౌలికసదుపాయాలన్నింటిని కల్పించాలన్నారు. తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గృహ లబ్ధిదారులకు మెగా తాళం చెవిని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నందన్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్డీఏపీడి ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేష్ నాయక్, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్, గృహ నిర్మాణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), సెప్టెంబరు 17: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కారక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి.. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ.. సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సత్వర న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సమస్యల వెల్లువ



జమ్మలమడుగు ప్రజాదర్బార్‌లో ఎంపీ అవినాశ్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న వైసీపీ నాయకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురు వైసీపీ నేతలు సమస్యలపై ఎంపీని నిలదీశారు. ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వస్తున్నారని తెలిసి పలు గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ.. మిమ్మల్ని నమ్ముకుని గ్రామాల్లో ఏజెంట్లుగా కూర్చున్నామని జమ్మలమడుగులో తమకు ఏమైనా జరిగితే దిక్కెవరని ప్రశ్నించారు. ధర్మాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, అతని అన్న కుమారుడు మాజీ ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగితే ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని, ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలోకి వచ్చి తనపైనే ఇలా మాట్లాడుతావా అంటూ మాజీ ఎమ్మెల్యే ఎదురు ప్రశ్న వేసినట్లు తెలిసింది. అనంతరం పి.బొమ్మేపల్లె, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వారి సమస్యలను ఎంపీకి వివరించారు. బొమ్మేపల్లె వద్ద జగనన్న కాలనీలో తలెత్తిన వివాదంపై బాధితులను తీసుకుని ఎంపీ ఆర్డీవో కార్యాలయాలనికి వెళ్లి ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, కోఆప్షన్ మెంబర్ గజ్జెల లక్షుమయ్య, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవానుమృతి



మృతిచెందిన ఆర్మీ జవాను సుబ్బారావు (ఫైల్), అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలకు తరలిస్తున్న ఆర్మీజవాన్లు, బంధువులు

వేంపల్లె, సెప్టెంబరు 17: వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన చల్లా సూర్యనారాయణ, వెంకటమ్మ కుమారుడు చల్లా సుబ్బారావు (40) ఆర్మీలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈనెల 15న అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తూ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. 18 సంవత్సరాల పాటు ఆర్మీలో విధులు నిర్వర్తించిన సుబ్బారావుకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు హేమ, జగదీష్‌లు ఉన్నారు. జవాను సుబ్బారావు మృతదేహాన్ని ప్రత్యేక వాహనం ద్వారా మంగళవారం వేంపల్లెకు తీసుకొచ్చి.. అధికార లాంఛనాలతో అంతిమసంస్కారాలు నిర్వహించారు.

నలుగురు తమిళ స్మగ్లర్లు అరెస్టు

కడప క్రైం, సెప్టంబర్ 17 కడప రేంజ్ మద్దిమడుగు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు కడప రేంజ్‌ఫారెస్టు అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం మీడియాకు తెలియపరిచారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన ధనరాజ్, గోపినాథ్, గుణశేఖరన్, ధర్మపురికి చెందిన వెంకటేశన్, కడప రవీంద్రనగర్‌కు చెందిన ఎస్.శామీర్‌బాలను అరెస్టు చేసినట్లు తెలిపారు. సుగాలిబిడికికి చెందిన బాబు నాయక్ పారిపోయాడని, నిందితుల నుంచి 18 దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగును అప్పగించిన పోలీసులు

కడప (క్రైం), సెప్టెంబరు 17: ఆటోలో వెళుతూ నగదు, బంగారు నగలు ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళకు తిరిగి కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ చేతుల మీదుగా ఆ బ్యాగును టూటౌన్ సీఐ నాగార్జున అందించారు. నకాస్‌కు చెందిన రిజ్వానా దేవునికడప రోడ్డులో ఆటో ఎక్కి ఓల్డ్ రిమ్స్ దగ్గర దిగింది. అదే సమయంలో మరో మహిళ కూడా ఆటోలో ఎక్కింది. రిజ్వానా తన బ్యాగు ఆటోలోనే పడేసుకుని వెళ్లిపోయింది. ఆటోలో ఉన్న మహిళ కొంత దూరం పోయాక పరిశీలించగా ఆటోలో బ్యాగు కనిపించడంతో కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆటోను గుర్తించి విచారించగా నగదున్న బ్యాగు పోలీసుస్టేషన్‌లో అప్పగించడంతో వారిని డీఎస్పీ, సీఐలు సత్కరించి బాధితురాలికి నగదు, బంగారు ఉన్న బ్యాగులు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు అహ్మద్ ఎంపిక

నందలూరు, సెప్టెంబరు 17: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో క్యారమ్స్ పోటీల్లో నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటి అహ్మద్ రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కడప బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అహ్మద్ ప్రతిభ కనబరచి ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారని తెలిపారు.

మంత్రి ప్రజాదర్బార్‌కు పోటెత్తిన ప్రజలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి

చిన్నమండెం, సెప్టెంబరు 17: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా ప్రజాదర్బార్‌కు ప్రజలు పోటెత్తారు. మంత్రి ఉదయం 6 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ కొన్ని సమస్యలకు అక్కడిక్కడ పరిష్కారం చూపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎన్నో కష్టాలు పడేవారని.. నేడు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: మానవుల ఆరోగ్యకరమైన జీవన విధానానికి మొక్కలు నాటి పర్యావరణం రక్షించడం అత్యవసరమని రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాదరెడ్డి అన్నారు. మంగళవారం వైవీయూలో జంతు శాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తల్లి కోసం ఓ మొక్క స్పెషల్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ యూనివర్శిటీ అంతా విభిన్న రకాలైన వృక్షజాతులతో విరాజిల్లుతుందన్నారు. మొక్క పెంచే ఉద్యమంలో మన యూనివర్శిటీ కూడా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ సుమిత్ర, వెంకటరమణ, శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, సెప్టెంబరు 17 : కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ పోటీల్లో పుల్లంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని మేరి, సీఈసీ విద్యార్థిని హర్షిత, సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని మమత, బాలుర విభాగంలో సెకండియర్ ఎంపీసీ విద్యార్థి రోహిత్‌లు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠ రావులు తెలిపారు. అలాగే ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో కూడా రోహిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

కొండాపురంలో పేలుతున్న ఐపీ బాంబులు

ఇటీవల ముగ్గురు ఐపీ పెట్టడంతో స్థానికుల బెంబేలు

కొండాపురం, సెప్టెంబరు 17: మండలంలో ఐపీ బాంబులు పేలుతుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కాలంలోనే ముగ్గురు ఐపీ దాఖలు చేయడంతో వడ్డీలకు ఇచ్చిన పలువురు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొందరు అధిక వడ్డీలకు ఆశపడి కొంతమంది ప్రముఖులకు డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ఆర్నెళ్ల కాలంలో వరుసగా ముగ్గురు ఐపీ దాఖలు చేయడంతో డబ్బులిచ్చిన పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆర్నెళ్ల కిందట పట్టణంలో ఒక పేరు మోసిన ప్రైవేటు పాఠశాల యజమాని సుమారు రూ.3 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు.ఇటీవల మరో వ్యాపారి రూ.10 కోట్లకు వరకు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాపారికి సంబంధించి స్థానికంగా కొంతమంది నాయకులు జోక్యం చేసుకొని అతని ఆస్తులు అమ్మి బాకీ ఉన్న వారికి కొంతమేర డబ్బులు చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా గత రెండు మూడు రోజులగా ఒక ఆర్ఎంపీ డాక్టర్ కూడా రూ.కోటి వరకు ఐపీ దాఖలు చేయనున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ డాక్టర్‌కు సంబంధించి ముంపు పరిహారం రావాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. అదీ ఇప్పటికీ రాకపోవడంతో వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి అధిక వడ్డీలు కట్టలేక సదరు ఆర్ఎంపీ డాక్టర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. దీంతో వడ్డీలకు ఇచ్చిన పలువురు ఆందోళన చెందు తున్నారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు అధిక వడ్డీలు వసూలు చేస్తుండటంతో వడ్డీలు కట్టలేక, చేసేది లేక పలువురు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

ఒమన్ నుంచి స్వదేశానికి..

● మహిళను 24 గంటల్లోనే రప్పించిన ఎస్పీ



ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న షహీనా, ఆమె భర్త, పిల్లలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 17: ఒమన్ దేశంలో తమ తల్లి ఇబ్బందులు పడుతోందని, వెంటనే ఇండియాకు రప్పించాలని బాధితురాలి పిల్లలు, భర్త ఎస్పీని కోరడంతో వెంటనే స్పందించిన ఆయన 24 గంటల్లోనే ఆ మహిళను స్వదేశానికి రప్పించారు. వివరాలిలా ఉన్నాయి. గాలివీడు మండలం పెద్దూరు గ్రామానికి చెందిన హసనాపురం షహీన బతుకుదెరువు కోసం ఈ ఏడాది ఆగస్టు 25న హైదరాబాద్ నుంచి ఒమన్‌కు వెళ్లింది. ఏజెంట్ మోసపూరిత వీసా తీయడంతో అక్కడ తీవ్ర ఇబ్బందులకు గురైంది. ఇక్కడ తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని విలపిస్తూ పంపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె అక్కడ పడుతున్న ఇబ్బందులపై ఆమె భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఈనెల 10న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు సమస్యను చెప్పారు. వెంటనే ఎస్పీ స్పందించి సంబంధిత ఏజెంట్‌తో మాట్లాడి కేవలం 24 గంటల్లోనే బాధితురాలిని స్వదేశానికి రప్పించేలా చర్యలు చేపట్టారు. ఈనెల 11న ఒమన్ నుంచి బయలుదేరిన షహీనా ఈనెల 12వ తేదీ బుధవారం సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. దీంతో మంగళవారం షహీనా తన భర్త, పిల్లలతో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5లక్షల సరుకుల ప్యాకెట్లు తరలింపు



సరుకుల పంపిణీ లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం నడుం బిగించింది. మంగళవారం కడప విద్యుత్ భవన్ నుంచి విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా రూ.5.35 లక్షలు విలువ చేసే ఇంటి సరుకులతో కూడిన 750 ప్యాకెట్లను లారీ ద్వారా తరలించారు. ఈకార్యక్రమాన్ని జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎస్.రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా వరద బాధితులకు అండగా నిలబడటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కన్‌స్ట్రక్షన్స్ మరియు సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు డి.నాగరాజు, సేవా సంఘం జనరల్ సెక్రటరీ ఎంవీ చలపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టెక్నికల్ హరిసేమనాయక్, అధికారులు, విద్యుత్ సిబ్బంది, అన్ని యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో నైపుణ్యాలపై వర్క్‌షాపు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17 : ఉన్నత విద్యలో నైపుణ్యం ఆధారిత పాఠ్యాంశాలపై వైవీయూలో ఈ నెల 26, 27 తేదీల్లో రెండురోజుల జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డి తెలిపారు. మంగళవారం వైవీయూలో వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి ప్రొఫెసరు సునీల్‌కుమార్ కీలక ఉప న్యాసం చేయనున్నారని తెలిపారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309276615, 8106604789, 8639648721 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సమష్టి కృషితో హరితాంధ్ర కడపగా తీర్చిదిద్దుదాం: ఎమ్మెల్యే





కడపలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మాధవి... మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు... ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17: హరితాంధ్ర కడపగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం కడప శివారు ప్రాంతం నగర వనంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. స్వచ్ఛతా హి సేవా కర్యాక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు హరితాంధ్ర కోసం అడుగువేద్దాం, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం అనే పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం సంతోసంగా ఉందన్నారు. భవిష్యత్ తరాల వారికి ఒక ఆరోగ్యకర సమాజం అందించాలన్నారు. అనంతరం మాధవి తమ తల్లి లక్ష్మీనారాయణమ్మ పేరు మీద మొక్క నాటారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డి, వారి తల్లి పేరు మీద మొక్కలు నాటారు. డీఎఫ్‌వో గురు ప్రభాకర్, సబ్ డీఎఫ్‌వో స్వామి, వివేకానంద మున్సిపల్ కమిషనరు వైవో నందన్, అడిషనల్ కమిషనరు రాకేశ్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ కడప సాధనకు కృషి చేయాలి

స్వచ్ఛ కడప సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనరు వైఓ నందన్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం నుంచి సంధ్య సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. అలాగే స్వచ్ఛత సేవ ప్రమాణాన్ని విద్యార్థులతో చేయించారు. అనంతరం మున్సిపల్ కమిషనరు వైఓ నందన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేశ్, మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనరు రాకేష్‌చంద్రం, మెప్మాసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్ర భారత్‌ను నిర్మించుకుందాం

చెన్నూరు, సెప్టెంబరు 17: పరిశుభ్ర భారత్‌ను నిర్మించుకుందాం అని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం చెన్నూరు బస్టాండులో ర్యాలీ అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ పరిశుభ్రమైన భారత్ వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యంశర్మ, తహసీల్దారు జీవన్‌చంద్రశేఖర్, ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, వ్యవసాయాకారిణి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టీడీపీ, వైసీపీ కన్వీనర్లు కె.విజయభాస్కర్‌రెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ప్రవీలమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

సింహాద్రిపురం, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇచ్చి సహకరించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా ఈ రోజు నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛతాహీ సేవా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ భవనం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులచే సింహాద్రిపురం బస్టాండు సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సర్కిల్‌లో విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. పంచాయతీ సర్పంచ్ రామ్మోహన్, టీడీపీ నేత ఆస్పత్రి మాజీ ఛైర్మన్ పుష్పాల శీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

తొలుత గండి క్షేత్రంలో సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం నాగులగుట్టపల్లె బీజేపీ రాష్ట్ర నాయకుడు రామచంద్రారెడ్డి, చక్రాయపేట కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాగులగుట్టపల్లె, చక్రాయపేట గ్రామాలలో ర్యాలీ నిర్వహించి జూనియర్ కళాశాల విద్యార్థినులచే మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమం అన్ని గ్రామాలలో నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రంతుబాష, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత కోసం పాటుపడతాం

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 17: ఆర్టీసీ బస్టాండు పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా వుంచడం కోసం వారానికి రెండు గంటల చొప్పున తోటి ఉద్యోగులతో కలిసి పనిచేద్దామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి వచ్చే అక్టోబరు 1 వరకు స్వచ్ఛత సేవ పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ ఆవరణంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి 2 గంటల చొప్పున పరిశుభ్రత కోసం శ్రమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ ఉద్యోగులు గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హరి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 17: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మేరి, ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మేరి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు ఖాదర్‌బాషా ప్రారంభించారు. ముందుగా నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జాకెట్లు పంపిణీ చేశారు.


అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాది రామయ్య, ఏవీ రమణ, నబీ, బాబుల్, మేరిన్‌బాబు, నగర పంచాయతీ సిబ్బంది, టీడీపీ కౌన్సిలర్లు డ్వాక్రా మహిళలు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





చెన్నూరులో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ పురుషోత్తం రాజు... సింహాద్రిపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి.. కమలాపురంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేరి

విజయదుర్గమ్మ ఆలయంలో రాహుకాల పూజలు




అలంకరణలో విజయదుర్గాదేవి ... అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 17: కడప నగరం బిల్టప్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజలకు జిల్లా నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరయ్యారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన దీపాలను వెలిగించి పూజలు చేశారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి: సీఐ



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 17:మండల పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించి తగు సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి మీ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలన్నారు. ఆటోలను ఎక్కడబడితే అక్కడ నిలబెట్టరాదన్నారు.

పారిశుధ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించండి

వల్లూరు, సెప్టెంబరు 17 : పారిశుధ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మురళి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన డీఈ మురళి ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతూ ప్రజల్లో పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే తాగునీరు పట్ల కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏఓ సాయిజ్యోతి మాట్లాడుతూ ఈకేవైసీ కార్యక్రమం సచివాలయంలో జరుగుతుందని, తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పవన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విభిన్న ఆహార పదార్థాలతో వంటకాలపై అవగాహన



చిన్న పిల్లలకు కాంప్లిమెంటరీ ఫుడ్ వంటకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింహాద్రిపురం, సెప్టెంబరు 17: చంటి బిడ్డకు 6 నెలల తర్వాత విభిన్న ఆహార పదార్థాలతో తయారు చేసి పెట్టవలసిన వంటకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత పేర్కొన్నారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆహార పదార్థాల ద్వారా కాంప్లిమెంటరీ ఫుడ్ వంటకాలను తయారు చేయడంపై అవగాహన కల్పించినట్లు వసంత తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, ఎమ్‌పీహెచ్‌ఎస్ రాధ, ఏఎన్ఎమ్ గంగాదేవి, అంగన్‌వాడి కార్యకర్తలు శ్రీలలిత, శాంతి, మల్లేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీడీపీ మండల ఇన్‌చార్జిగా మహేశ్వర్‌రెడ్డినే కొనసాగించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చక్రాయపేట, సెప్టెంబరు 17: టీడీపీ మండల ఇన్‌చార్జిగా తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డినే కొనసాగించాలని ఆ పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మహేశ్వర్‌రెడ్డి స్వగృహంలో వారు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, చిలేకాంపల్లె రామాంజులరెడ్డి, మెడికల్ స్టోర్ ఆంజనేయులు, తుపాకుల చంద్ర, సుబ్బరామయ్య, గణేష్, యోగీశ్వర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి, అమర్, కిషోర్‌లతో పాటు దాదాపు 200 మంది సమావేశమై మహేశ్వర్‌రెడ్డినే కొనసాగాలని తీర్మానించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఇటీవల మండలంలో భాస్కర్‌రెడ్డి కావాలని కొందరు, మహేశ్వర్‌రెడ్డినే కొనసాగాలని మరికొందరు పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీని నిలబెట్టి కార్యకర్తలకు అండదండగా ఉంటూ సొంత ఖర్చుతో పార్టీని నిలబెట్టి వైసీపీకి మెజార్టీ రాకుండా చేసిన ఘనత మహేశ్వర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటీవల లోమడ భాస్కర్‌రెడ్డి వర్గం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని కలిసి మహేశ్వర్‌రెడ్డి ఒక వర్గానికి పనిచేస్తున్నాడంటూ ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన కార్యకర్తలు మహేశ్వర్‌రెడ్డి అందరికీ పలుకుతాడని, అవసరమైన వారు వచ్చి పనులు చేయించుకోవాలని తెలిపారు. కొందరు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరి లేనిపోనివి సృష్టిస్తున్నారన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చక్రాయపేట, సెప్టెంబరు 17: చెకుముకి సైన్స్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం నాగులగుట్టపల్లెలో ప్రధానోపాధ్యాయులు సంజీవకుమార్, ఎంఈఓ రవికుమార్, జేవీవీ జిల్లా నాయకులు గంగాధర్‌రెడ్డి ఆవిష్కరించారు. శాస్త్రీయ నిర్మాణమే ధ్యేయంగా జేవీవీ కృషి చేస్తోందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలని కోరారు. హెచ్ఎం సంజీవకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాభివృద్ధికి జేవీవీ కృషిచేస్తోందన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో జేవీవీ కృషి మరువలేనిదన్నారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్



ఆంజనేయ

సీకేదిన్నె, సెప్టెంబరు 17: అన్నమాచార్య అధ్యాపకుడు ఆంజనేయకు డాక్టరేట్ లభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న అంజనేయకు తమిళనాడు రాష్ట్రం ఏలూరులోని ఏలూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఏలూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జి.కె.రజని పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆంజనేయకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఆంజనేయకు డాక్టరేట్ రావడంపట్ల విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమం



కడప (కల్చరల్), సెప్టెంబరు 17: దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా మూడవ రోజైన మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తి శ్రద్ధలతో పవిత్ర హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు త్రివిక్రమ్, సాయి, కృష్ణమోహన్ వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా హోమం నిర్వహించారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి: ఏఐఎస్‌బీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17 : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనరు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప ప్రభుత్వ ఐటీఐలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సరైన సదుపాయాలులేక ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సైతం విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మద్యం స్వాధీనం- ఒకరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 17: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి సుమారు 8గంటల ప్రాంతంలో కమలాపురం రైల్వే గేటు సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. పోలీసులు తనిఖీ చేయగా అక్రమ మద్యం బయటపడిందన్నారు. అక్రమ మద్యం తరలిస్తున్న కమలాపురం టౌన్ రైల్వేగేటు వద్ద కమలాపురం టౌన్‌లోని సాయి అనే యువకుడి వద్ద 50 బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతని మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపు నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్



పట్టుబడ్డ గ్రావెల్ టిప్పర్లు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 17: మండలంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్ చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. మండలంలోని ఈర్లపల్లె వద్ద నుంచి గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకొని వాటిని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు.

పరారీకి యత్నించిన

రిమాండ్ ఖైదీకి గాయాలు

- చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలింపు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 17:పులివెందుల మండలం రాయలాపురం గ్రామయంలో శుక్రవారం సొంత తమ్ముడిని హత్యచేసిన కేసులో అరెస్టయి ఖైదీగా ఉన్న బాబా ఫక్రుద్దీన్‌ను మంగళవారం పులివెందుల పోలీసులు కోర్టుకు హాజరుపరుస్తున్న సమయంలో కోర్టు సమీపానికి చేరుకోగాను పరారయ్యేందుకు యత్నించాడు. పోలీసులు వెంటపడటంతో గోడ దూకేందుకు యత్నించగా కింద పడి కాలు విరిగినట్లు సమాచారం. కాలు విరిగిన బాబాఫక్రుద్దీన్‌ను పోలీసులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దృశ్యం

కడప (క్రైం),సెప్టెంబరు 17 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి 1998 బ్యాచ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ సభ్యులు అయ్యవారయ్య, సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.58వేల నగదు అందించారు. ఆయన కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి తమ అసోసియేషన్ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించి ఉపాధి కల్పించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 17:కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించి వలసలు, కరువును నివారించాలని పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కె.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.

కొత్తకొత్త ఆలోచనల కోసం ట్రిపుల్‌ఐటీలో 'హ్యాకథాన్'



ట్రిపుల్‌ఐటీలో హ్యాకథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

వేంపల్లె, సెప్టెంబరు 17: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల్లో ఉన్న కొత్తకొత్త ఆలోచనల కోసం ఇంటర్నల్ హ్యాకథాన్ ప్రోగ్రాం నిర్వహించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆధ్వర్యంలో ఈ హ్యాకథాన్-24 కార్యక్రమాన్ని నాలుగురోజుల పాటు నిర్వహించారు. మంగళవారం కార్యక్రమం ముగిసింది. కంప్యూటర్ సెంటర్ మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ-1 నుంచి ఈ-4 విద్యార్థులు 30 బృందాలలో 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్ కార్యక్రమంలో 34 కొత్త ఆలోచనలను గుర్తించినట్లు డైరెక్టర్ తెలిపారు.

'బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తిరిగి ఏర్పాటు చేయాలి'

వేంపల్లె, సెప్టెంబరు 17: రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను టీడీపీ ప్రభుత్వం తిరిగి ఏర్పాటుచేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక కడప, అనంతపురం నాయకులు ప్రసాదరావు, రఘునాథరావులు తెలిపారు. వేంపల్లెలో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2014-2019 మధ్యన టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణుల కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేసి స్వయం ఉపాధి రుణాలు, ధూపదీప నైవేద్యం కింద ఆలయాల్లోని పూజారులకు వేతనాలు ఇచ్చారని గుర్తుచేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరించిందని తెలిపారు. వారికి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ వచ్చింది బ్రాహ్మణులంతా టీడీపీ వెంట ఉన్నారు. బ్రాహ్మణులకు మంచి జరిగేలా కార్పొరేషన్ తిరిగి ఏర్పాటుచేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో బ్రాహ్మణులంతా ఒకేతాటిపైకి వచ్చేలా సమావేశాలు త్వరలో నిర్వహించనున్నామని, బ్రాహ్మణులంతా టీడీపీకి అండగా ఉంటారు, రాబోవురోజుల్లో 2029లో మళ్లీ టీడీపీకే విజయం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

జోనల్‌స్థాయికి ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

వేంపల్లె, సెప్టెంబరు 17: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేంపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఎంపిక పోటీలలో వేంపల్లె శ్రీచైతన్య విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి జోనల్ స్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. ఖోఖో అండర్-17 విభాగంలో నలుగురు విద్యార్థులు, అండర్-14 విభాగంలో నలుగురు, కబడ్డీ అండర్-14లో ఇద్దరు, అండర్-17లో ఒక్కరు, వాలీబాల్ అండర్-17లో ముగ్గురు, అండర్-14 ముగ్గురు ఎంపికయ్యారన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం

వేంపల్లె, సెప్టెంబరు 17: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడమే చెకుముకి సైన్స్ టెస్ట్ పోటీల లక్ష్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బాలజయన్న, యూటీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు, జేవీవీ గౌరవాధ్యక్షులు గంగాధర్‌రెడ్డిలు తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీలకు సంబంధించి గోడపత్రాలను మంగళవారం విడుదల చేశారు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 17 : పట్టణంలోని వైఎస్ఆర్ సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రెండోరోజున నల్లబ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సులు శైలజ, హారికలు మాట్లాడుతూ జీఓ నెం115ను వెంటనే రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. గత 15ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ, ఎమ్మెల్సీ, పీహెచ్‌ఏ చేసిన వారిని గుర్తించాలన్నారు. అలాగే ముందు చదువుకుని ఉన్న నర్సింగ్ విద్యార్థులను గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరసనలు చేస్తామని అన్నారు.

ఆవాస్ గృహాలు ప్రారంభం



గృహాలను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 17 :దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఆవాస్ గ్రామీణ, పట్టణ గృహ ప్రవేశాలను ప్రారంభించారు. మంగళవారం పులివెందుల పట్టణంలోని నగిరిగుట్టలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో బీఎల్‌సీ పథకం కింద మంజూరైన ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, మైసూరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈలు ప్రమోద్‌కుమార్, పురుషోత్తంనాయక్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి: ఏడీఏ

లింగాల, సెప్టెంబరు 17: అంకితభావంతో పనిచేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం పెద్దకుడాల, మురారిచింతల రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయాధికారి రమేష్‌తో కలిసి ఏడీఏ పరిశీలించారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

ఆంధ్రజ్యోతి విజిట్

ఆసుపత్రుల నిండా అనారోగ్య పీడితులు ● పట్టణాలు, గ్రామాలని తేడా లేకుండా జ్వరాలు

● క్యాష్ చేసుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు ● గ్రామాల్లో వైద్య సేవలు అంతంత మాత్రమే



బద్వేలులో జ్వరంతో బాధపడుతున్న చిన్నారి బృంద, గోపవరంలో జ్వరంతో అల్లాడుతున్న బాలుడు



బద్వేలు...నరసన్నపల్లెలో జ్వరంతో బాధపడుతున్న నారాయణ, నారాయణమ్మ దంపతులు

ప్రొద్దుటూరు/బద్వేలు/జమ్మలమడుగు , సెప్టెంబరు 17 : జిల్లాలో పెద్దగా వర్షాలు లేనప్పటికీ విష జ్వరాలు మాత్రం విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగా దోమలు వృద్ధి చెంది విజృంభిస్తుండటంతో జ్వరాలు ప్రబలుతున్నాయి.అంతేకాక నీళ్ల వాతావరణ ప్రభావంతో కూడా వైరల్ ఫీవర్స్ పెరుగుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ కేసులు లేవని చెబుతున్నా ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితులు క్యూకడుతున్నారు. వైద్య అధికారులు వైరల్ ఫీవర్స్ వున్నాయని దగ్గు,జలుబుతో కూడా అనారోగ్యాలతో ఆసుపత్రులకు వెళుతున్నారని చెబుతున్నారు. విషజ్వరాల విజృంభన పై ఆంధ్రజ్యోతి విజిట్‌లో పలుమండలాల్లో జ్వర పీడితుల గురించి ప్రత్యేక కథనం...

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో వైద్య అధికారులు వెల్లడించిన రిపోర్టు మేరకు డెంగ్యూ కేసులు 11, మలేరియా కేసులు రెండు, చికెన్ గున్యాకేసులు ఒకటి వున్నట్లు వైద్యఅధికారులు ధృవీకరించారు.ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో జ్వరం పీడితులు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. వైరల్ ఫీవర్ ,డయేరియా కేసులు సాధారణంగా వస్తున్నట్లు వైద్య అధికారులు వెల్లడిస్తున్నారు. జమ్మలమడుగు నియోజక వర్గ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రికి జ్వరపీడితులు క్యూకట్టారు. ముఖ్యంగా టైఫాయిడ్ జ్వరాలతో ఆసుపత్రు ల్లో చికిత్స పొందుతున్నట్లు జ్వరపీడితులు వెల్లడించారు. ముద్దనూరు,కొండాపురం,ఎర్రగుంట్ల,మైలవరం మండలాల్లో జ్వరాలు వున్నట్లు వైద్య అధికారులు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో మైదుకూరు ప్రభుత్వ ఆసుత్రిలో జ్వరపీడితులు క్యూకట్టారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో గ్రామాల్లో పారిశుధ్య లోపం వలన కూడా దోమలు విజృంభిస్తుండటంతో జ్వరాలు ప్రబలున్నతున్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. ఖాజీపేట మండలం చెన్న ముక్కపల్లె గ్రామంలోని హరిజనవాడలో వారం రోజులుగా టైఫాయిడ్,మలేరియా జ్వరాలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్లులో చికిత్స చేయించుకుంటున్నారు.



ప్రొద్దుటూరు... జ్వరంతో మంచం పట్టిన చిన్నారి, మైదుకూరు హాస్పిటల్‌లో క్యూ కట్టిన రోగులు



జమ్మలమడుగు ఆస్పత్రిలో టైఫాయిడ్ జ్వరంతో చికిత్స పొందుతున్న గూడెం చెరువు మహిళ, మామిళ్లపల్లెలో జ్వరంతో మంచానికే పరిమితమైన మహిళలు

ప్రభుత్వ వైద్య సిబ్బంది మాత్రం తూతూ మంత్రంగా సేవలు అందిస్తున్నట్లు హరిజనవాడ వాసులు వాపోతున్నారు. చాపాడు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాల్లో జ్వరాలు వున్నాయి. వారంతా ప్రొద్దుటూరు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యలోపం వల్ల కూడా విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు.

బద్వేలు..: ఏ గ్రామం చూసినా జనం మంచం పట్టారు. జ్వరాలతో బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇంటికొకరు, ఇద్దరు బాధితులుగా మారారు. జ్వరం గ్రామ గ్రామాన విజృంభిస్తోంది. వైద్య సేవలకోసం దగ్గరలోని చిన్న పట్టణాలకు, కడప, ప్రొద్దుటూరు పట్టణాల లోని ఆసుపత్రులకు వెళుతున్నారు. మరి తీవ్రమైన జ్వరాలై కర్నూలు, తిరుపతి, ప్రాంతాలకు వెళుతున్నారు. ఊరు దాటితే వేలకు వేలు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రజ్యోతి జ్వరాలపై మంగళవారం చేసిన సర్వేలో భాగంగా బద్వేలు ప్రాంతంలో పలు గ్రామాలను పరిశీలించారు. ఒక్కొక్క గ్రామంలో 20 నుంచి 30 మంది జ్వరపీడితులు ఉన్నారు. మరోవైపు వ్యవసాయ సీజన్ కావడం ఈ సమయంలో జ్వరాలు విజృంభించడంతో వ్యవసాయ పనులు కూడా పూర్తిగా మందగించే పరిస్థితి గ్రామాలలో కనిపిస్తోంది.

ఏ పల్లెకెళ్లినా..: పరిశీలనలో భాగంగా ఏ పల్లెకు వెళ్లినా జ్వరాలతో బాధపడేవారు కనిపిస్తున్నారు. పోరుమామిళ్ల మండలంలోని రామాయ పల్లెలో 30 మందికి పైగా జ్వరాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. కాశినాయన మండలం నరసన్న పల్లె గ్రామంలో 25 మంది చలి, జ్వరంతో మంచానికే పరిమి తమయ్యారు. రక్తకణాలు తగ్గడం, దగ్గు, జ్వరంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. బి.కోడూరు మండలం సిరిగిరిపల్లె లో 30మందికి పైగానే జ్వరాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గోపవరం మండలంలోని రాచాయపేట హరిజనవాడలో 10 కుటుంబాల వారు జ్వరంతో అల్లాడు తున్నారు. కలసపాడు మండలంలోని మామిళ్ల పల్లెలో దాదాపు 10 కుటుంబాలు జ్వరాలతో అవస్థలు పడుతు న్నారు. అట్లూరు మండలం గాండ్ల పల్లె గ్రామంలో 50 మంది మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించాలని, పారిశుద్ధ్యంపై దృష్టిసారిం చాలని ప్రజలు కోరుతున్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో అన్ని గ్రామాలలో వైరల్ జ్వరాలు ఉన్నాయి. 15 రోజుల నుంచి జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రక్త పరీక్షల ల్యాబ్‌లు నిండాయి. కొందరు పేదలు డబ్బులు లేక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక ప్రభుత్వ ఆస్పత్రిలో వారాల తరబడి మగ్గుతున్నట్లు రోగులు తెలిపారు. అందులో భాగంగా మండలంలోని గూడెం చెరువు, పొన్నతోట గ్రామాల్లో ఎక్కువగా జ్వరాలు ఉన్నట్లు రోగులు తెలియజేశారు. తమ గ్రామాలకు వైద్య సిబ్బంది సందర్శించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. రక్త పరీక్షలకు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఆయిల్ మిల్లుపై విజిలెన్సు అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 17 : ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని శ్రీరామ ఆయిల్ మిల్లులో విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం జరిపిన ఈ తనిఖీల్లో పామాయిల్ లారీల ద్వారా రవాణా చేసుకుంటున్న మిల్లు యజమానులు జీఎస్టీ బిల్లులు చూపాలని అడిగారు. బిల్లులు చూపకపోవడంతో పాటు తనిఖీల్లో బయట పడ్డ లోపాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదిస్తామని విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ కంట్రోల్ అధికారి అనిత, తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ జయదేవ్, సుదర్శన్ వున్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 17 : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్దతిన నియమితులైన స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని కోరారు. ఆమేరకు మంగళవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై చంద్రబాబుతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు.

'ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తా'

బద్వేలుటౌన్, సెప్టెంబరు 17 : బ్రహ్మంసాగర్ ఎడమకాలువ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని టీడీపీ బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంసాగర్‌కు కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో నీరు అందడంతో బిజివేముల వీరారెడ్డి ఎడమకాలువ ద్వారా నీరు వదులుతామన్నారు. నాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్,బీవీ సుబ్బారెడ్డి, కనుమ ళ్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, లకిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగర పంచాయతీ కమిషనర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శాంతికళ ఆల్‌బెండజోల్ టాబ్లెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షమనాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: విద్యార్థులు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని నేషనల్ హెల్త్‌మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. హెచ్‌ఎం గురప్ప, వైద్యాధికారి డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: నులి పురుగుల నిర్మూలనతోనే పిల్లలకు ఆరోగ్యం పదిలంగా వుంటుందని హెల్త్ సూపర్ వైజర్ బీవీ వరప్రసాద్ పేర్కొన్నారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు తెలిపారు.అలాగేతాళ్ళమాపురం జడ్పీ హైస్కూల్లో నులిపురుగుల మందులను పిల్లలకు వేశారు. హెల్త్ సూపర్ వైజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్‌మాత్రలు వాడాలని మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి, ఎంఈవో ప్రమీల, ఎంపీడీవో నూర్జహాన్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనంలో ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిం చారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, హెల్త్‌ఎడ్యుకేటరు రంగయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..జేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ రంగసముద్రం-1 లో ఉన్న ఏపీజీడబ్ల్యూపీ స్కూలులో జాతీయ నులి పురుగుల నివారణ దినం నిర్వహించారు.ప్రిన్సిపాల్,ఏఎన్ఎంనిర్మల పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలల్లో నులి పురుగుల మాత్రలను వైద్యాధికారి వినీత్‌కుమార్ రాజు విద్యార్థులతో మింగించారు. సీహెచ్‌వో నాగమణి, పుష్పాంజలి, జాన్‌విలియం, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాజీపేట..:పిల్లల్లో నులిపురుగులు లేకుండా నియంత్రించడమే లక్ష్యమని వైద్యాధికారి ముబీన్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఆర్ఈఎస్ఎస్‌వీ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు శోభన్‌బాబు, కృష్ణప్రియ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: 'పత్తి రైతుకు పురుగు భయం' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కడప రైతు శిక్షణ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు,ఆత్మ, డీఆర్‌సీ అధికారులు పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. తొలిదశలో క్లోరిపైరిఫాస్, క్వినాల్‌ఫాస్ వంటి మందులు పిచికారి చేయాల న్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలక్రిష్ణ, టీడీపీ జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున, ఆత్మా డీపీడీ పద్మలత, రైతు శిక్షణ కేంద్రం ఏవో పద్మజ, ప్రొద్దుటూరు ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ ప్రధాని మోదీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: భారతదేశం గర్వించదగ్గ ప్రధాని మోదీ అంటూ బీజేపీ నాయకులు తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవగుడి గోవర్ధన్‌రెడ్డి, చౌడం జొల్లు కొండయ్య ,బేపారి మహ్మద్‌రఫి, కొమెర్ల జాకీర్, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, పోలీసు చంద్ర, ఓబుళరెడ్డి, ఈశ్వరయ్య, బికారి, గౌస్‌మొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: దేశంలో పేదరిక నిర్మూలనకు మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మోదీ జన్మదినం సందర్భంగా ఎస్వీ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 64 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, జిల్లా కార్యదర్శి పృథ్వీనారాయణ, కోనేటి ప్రదీప్‌రెడ్డి, పర్లపాడు గౌరీశంకర్, భాస్కర్‌రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, రవిశంకర్, గురుప్రసాద్, కిరణ్, సి.వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మోదీ పుట్టినరోజు సందర్భంగా మైదుకూరు బీజేపీ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు,కార్యకర్తలు, నాయకులు పాల్గొని రక్తం దానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ సర్వేకు శ్రీకారం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 17 : కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాలతో పెన్నానది పరివాహకంలో అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఆమేరకు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెన్నానదిలో నిర్మాణంలో వున్న హైలెవెల్ వంతెనకు చేపట్టిన భూ సేకరణలో ఫారెస్టు ల్యాండు వున్నదనే ఆ శాఖ వాదపై తర్జన భర్జనలు జరిగి చివరికి మళ్ళీ జాయింట్ సర్వేచేపట్టాలని నిర్ణయించారు. ఆమేరకు బుధవారం నుంచి సర్వే చేపట్టనున్నల్లు తహసీల్దారు గంగయ్య తెలిపారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం:ఎమ్మెల్యే, ఎంపీ



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే

జమ్మలమడుగు, సెప్టెంబరు 17: మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఆయన తనయుడు ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను, విశ్వనాథపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు, , మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, గోసుల క్రిష్టారెడ్డి, వెంకటేశ్వరారెడ్డి, గోర్ల సుబ్బరాయుడు, పసల వెంకటరమణ, రామమోహన్, గురివిరెడ్డి, వేమారెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మేకల బాబు, వీరనారాయణ, పెరుగు నారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో సావిత్రమ్మ, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంట పనుల్లో విద్యార్థులు



వంట పనులు చేస్తున్న విద్యార్థులు

అట్లూరు, సెప్టెంబరు 17 : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు మండలంలోని ఉన్నతపాఠశాల విద్యార్థుల చేత మంగళవారం బీసీ హాస్టల్‌లో కూరగాయలు తరిగించి వంట చేయించారు. అట్లూరు ఉన్నత పాఠశాలలో బద్వేలు నియోజక వర్గంలోని ఏడు మండలాలకు సంబంధించి 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్‌కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉన్నత పాఠశాల పక్కనే బీసీ బాలుర వసతిగృహం ఉంది. సమావేశానికి వచ్చిన ఉపాధ్యాయులు, అధికారులకు మధ్యాహ్న భోజనం బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. భోజనం తయారీకి వంట మనుషులకు బదులు విద్యార్థులను ఉపయోగించారు. అట్లూరు హెచ్‌ఎం అశ్వత్థరెడ్డిని వివరణ కోరగా పిల్లల చేత వంట చేయించే విషయం తనకు తెలియదు, పీఈటీ టీచరు విద్యార్థులను తీసుకెళ్లి వంట పనులను చేయించడంపై వివరణ అడగుతానన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కాశినాయన సెప్టెంబరు17:వరికుంట్ల గ్రామానికి చెందిన దబ్బనం రాజశేఖర్ అనేవ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి అతనివద్దనుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ హనుమంతు తెలిపారు.కొంతకాలంగా రాజశేఖర్ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు రాబడిన సమాచారంమేరకు నిఘా పెట్టడంతో మద్యంతో పటుబడ్డాడన్నారు. ఆమేరకు కేసు నమోదు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో విరాట్ విశ్వకర్మ జయంతి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 17 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమాలను స్థానిక ఆంధ్ర, కర్ణాటక కల్యాణ మండపంలో చేపట్టారు. ఉదయం విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలతో పాటు మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలను చేపట్టారు. స్వామివారిని కలశాలతో సంఘం సభ్యులు ఊరేగించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 17 : ఆర్టీపీపీలో 15 నుంచి 20 ఏళ్ళుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల మీద ప్రభుత్వంతో విద్యుత్ యాజమాన్యాలతో మాట్లాడి పరిష్కారం చేసేందుకు ఎమ్మెల్యేలు చొరవ చూపాలని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు మంగవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బిరెడ్డి,గంగయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కలసపాడు, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని కలసపాడులో మంగళవారం స్వచ్ఛతాహీ కార్యక్రమంపై అధికారులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీయం సుబ్బరాయుడు, ఎంపీడీవో మహబూబ్‌బీ మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో శివశంకర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, రాజుపాలెం సర్పంచ్ రామక్రిష్టారెడ్డి, మహానందిపల్లె మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..:స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నర్సాపురంలో మంగళవారం విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మైథిలీ,మిద్దెల సర్పంచ్ వెంకట్రామిరెడ్డి,ఈవోపీఆర్డీ ముజఫర్ రహీం పాల్గొన్నారు.

బద్వేలు./బద్వేలు టౌన్..: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పర్యవేక్షణలో పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టి అనంతరం మెయిన్ రోడ్డులో మాస్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, సచివాలయ, మెప్మా, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని ఏడు గ్రామ సచివాలయాల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో సుజాతమ్మ, శివప్రసాద్ ర్యాలీ నిర్వహించారు.

మైలవరం..: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి లక్ష్యమని ఎంఈఓ చిట్టిబాబు, ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి అన్నారు. వేపరాలలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. చిలమకూరులో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు ఏర్పాటు చేశారు. సర్పంచ్ వై.లక్ష్మీదేవి, వార్డు మెంబర్లు, హరితరాయబారులు, సెక్రటరీ స్పెషలాఫీసర్ విజయ్‌కుమార్, హెచ్‌ఎంలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మైలవరంలో ర్యాలీలో మాట్లాడుతున్న ఎంఈఓ

బి.కోడూరు..: పది గ్రామపంచాయతీల్లో అన్నిశాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కొండాపురం..:స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ,మానవహారం నిర్వహించారు.ఎంపీడీవో నాగప్రసాద్ ,ఏవో శ్రీనివాసు లరెడ్డి, ఈవోపీఆర్ డీ శశిధర్‌రెడ్డి, సెక్రటరీ శర్వాణీ, హెచ్‌ఎం కిశోర్‌రెడ్డి, శివసాయి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ,ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ తెలిపారు. రాయల కూడలి వద్ద స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్ర రాజసింహ,ఎంపీడీఓ లక్ష్మీదేవి, పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,టీడీపీ మండలాధ్యక్షుడు భీమయ్య, సుకుంలగారిపల్లె కిషోర్,ధనపాల జగన్,ఏపీ రవీంద్ర,ఇస్మాయిల్, ఆకుల క్రిష్ణయ్య,పిచ్చపాటి వీరారెడ్డి, మేకల బాబు,అన్నవరం సుధాకర్‌రెడ్డి,మిల్లుశ్రీను, పుట్టా ప్రభాకర్,కటారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు.స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం సచివాలయ, వెలుగు, అంగన్వాడీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ కార్యక్రమంలోఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఏపీఎం ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో ఎంపీడీవో వర ప్రసాదరావు ఆధ్వర్యంలో పురవీధుల్లో సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి, పోరుమామిళ్ల పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: పరిసరాల పరిశుభ్రతే ప్రజా ఆరోగ్యానికి భద్రత అని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయిక్రిష్ణ పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ గోవిందరెడ్డి,నూర్ బాషా, వంకం సుబ్బరాయుడు, ఎంఈవో సావిత్రమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరం..: గోపవరంలో జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులచే ఘనంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఎంపీడీవో రామక్రిష్ణయ్య పీవోఆర్‌డీ షేక్ హసీనా తదితరులు పాల్గొన్నారు.